క్లుప్తంగా

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు గురువారం ఉదయం 9గంటలకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శంకుస్థాపన చేస్తారని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది ఓ ప్రకటనలో తెలిపింది. దీనబంధు కాలనీలో రూ.49.50 లక్షలు, హనుమాన్‌నగర్ కాలనీలో రూ.22.50లక్షలు, ప్రగతినగర్‌కాలనీలో రూ.45లక్షలు, పాపిరెడ్డినగర్ కాలనీలో రూ.131.50 లక్షలు, ఆస్‌బెస్టాస్ కాలనీలో రూ.65లక్షలు, పాపారాయుడు నగర్‌లో రూ.92.80 లక్షల నిధులతో సీసీరోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు, అసోసియేషన్ సభ్యులు, అనుబంధ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

హైదర్‌నగర్‌లో సిగ్నల్ వ్యవస్థను బాగు చేయండి

కూకట్‌పల్లి: హైదర్‌నగర్‌లోని సిగ్నల్ లైట్లను వెంటనే బాగు చేయాలని సీపీఎం నాయకులు బుధవారం డిమాండ్ చేశారు. నాలుగు రోజులుగా సిగ్నల్ వ్యవస్థ దెబ్బతినటంతో రోడ్డు దాటే వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ట్రాఫిక్ టెక్నీషియన్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా సిగ్నల్ వ్యవస్థను బాగు చేయాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శంకర్, శ్రీను, నరసింహ, వెంకటయ్య, అశోక్, మహేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి చిల్డ్రన్స్ సమ్మర్ క్యాంప్

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో 'బాలబృందావనం' పేరిట చిల్డ్రన్స్ సమ్మర్ క్యాంప్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తారు. ఈ క్యాంప్‌లో పాల్గొనేందుకు 9 నుంచి 14 ఏళ్లలోపు వారికే అవకాశం. కార్యక్రమంలో పాల్గొనేవారు తమ పేర్లను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించాలి.

నేడు, రేపు అంతర్జాతీయ సమావేశం

రాయదుర్గం: మనూ విశ్వవిద్యాలయంలోని ఇంగ్లిష్ విభాగం, నేషనల్ ట్రాన్స్‌లేషన్ మిషన్(ఎన్‌టీఎం) సెంటర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ సహకారంతో రెండు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సమావేశం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆ విభాగం హెడ్ ప్రొఫెసర్ షాహీన్ బుధవారం తెలిపారు. 'భాష, సాహిత్యం యొక్క విభజనలను అన్వేషించడం' అనే అంశంపై ఈ సమావేశం సాగుతుంది. గురువారం ఉదయం 11 గంటలకు ఉర్దూ విశ్వవిద్యాలయంలోని సీపీడీయూఎంటీ ఆడిటోరియంలో ఈ సమావేశాన్ని ప్రారంభిస్తారు. పరిశోధనా ఫలితాలు, అనుభవాలను పంచుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధకులు ఈ సమావేశంలో పాల్గొంటారన్నారు.

బడ్జెట్‌లో విద్య, వైద్యానికి అధిక నిధులు కేటాయించాలి



ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

కవాడిగూడ: రాష్ట్ర బడ్జెట్‌లో విద్య, వైద్యానికి అధిక నిధులు కేటాయించాలని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం డిమాండ్ చేశారు. ప్రజలందరికీ విద్య, వైద్యాన్ని ఉచితంగా ప్రభుత్వమే ఇవ్వాలని కోరుతూ.. ఉచిత వైద్య, విద్యాసాధన సమితి, పీపుల్స్ ప్రొటెక్షన్ పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద నిరసన దీక్షను చేపట్టారు. ఈ దీక్షకు మద్దతుగా ప్రొఫెసర్ కోదండరాం పీపుల్స్ ప్రొటెక్షన్ పార్టీ వ్యవస్థాపకుడు సదానందరెడ్డి, ఉచిత విద్య, వైద్య సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, టీజేఎస్‌గ్రేటర్ కార్యదర్శి ఎం నర్సయ్య హాజరయ్యారు. కోదండరాం మాట్లాడుతూ.. విద్య, వైద్యానికి కనీస బడ్జెట్ కేటాయించలేని దుర్మార్గపు పాలన నడుస్తోందని ఆరోపించారు. సదానందరెడ్డి, ధనమ్మ, వెంకటేశ్వర్లు, సుధాకర్, లక్ష్మణ్‌రావు, శ్రీనివాస్‌నాయక్, సాయికుమార్, బద్రయ్య తదితరులున్నారు.

మహిళా ఆత్మహత్య

భాగ్యనగర్‌కాలనీ: ఓ మహిళ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి వెంకట్రావునగర్ కాలనీలో నివాసం ఉంటున్న కుమ్మరి వరలక్ష్మి(23) కుటుంబ సమస్యలు తాళలేక చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతురాలి వివరాలు తెలుసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కార్పొరేటర్ల పర్యటన..

- సమస్యలను నేరుగా తెలుసుకుంటున్న ప్రజాప్రతినిధులు
- కాలనీ, బస్తీల్లో పర్యటించి సమస్యల పరిశీలన
- అధికారులకు తెలిపి పరిష్కరించుకుంటున్న స్థానికులు

సమస్యల పరిశీలన



బాలాజీనగర్ డివిజన్‌లో స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ శిరీష

మూసాపేట: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు బుధవారం బాలాజీనగర్ డివిజన్‌లోని న్యూ, ఓల్డ్, వివేక్‌నగర్ కాలనీల్లో అన్ని విభాగాల అధికారులతో కలిసి కార్పొరేటర్ శిరీష బాబూరావు పాదయాత్ర చేశారు. బస్తీల్లో నెలకొన్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కాలనీ అభివృద్ధి పనులన్నీ దాదాపు పూర్తయ్యాయని తెలిపారు. బాలాజీనగర్ డివిజన్ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా నిధులను మంజూరు చేస్తున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి వెంకటేష్ చౌదరి, బండి సుధా, డా. వెంకట్రావు, అంజిరెడ్డి, యెట్టయ్య, రవీందర్‌రెడ్డి, జశ్వంత్, బండి ప్రభు, ఆరోగ్యరెడ్డి, సురేష్, కార్యదర్శి అనిల్‌కుమార్, లలిత, సత్యనారాయణ, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలి



మూసాపేట డివిజన్‌లో పర్యటిస్తున్న మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్

జనతానగర్, వడ్డెర బస్తీలో బుధవారం మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ పర్యటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించే కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. స్థానికులు చెప్పిన సమస్యలను విని, వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, నాయకులు తుకారాం, రాజు, నర్సింహ,రాము, జైరాజ్, అరుణ్, రమేష్, అక్బర్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వీలైనంత త్వరగా పరిష్కరిస్తాం..



ఫతేనగర్ డివిజన్ ఆల్విన్‌కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకున్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్

మోతీనగర్: బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందని అల్లాపూర్ కార్పొరేటర్ సబిహా బేగం అన్నారు. బుధవారం పండిట్ నెహ్రూనగర్‌లో ఆమె పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని ఆమె పేర్కొన్నారు.

ఫతేనగర్ డివిజన్‌లో..

ఫతేనగర్ డివిజన్‌లోని ఆల్విన్‌కాలనీలో బుధవారం కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు తాగునీటి సమస్య, శ్మశానవాటిక అభివృద్ధి గురించి కార్పొరేటర్‌తో ప్రస్తావించారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు మంచినీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. శ్మశానవాటిక అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గోవిందప్ప, వీరేశం గుప్తా, సత్యనారాయణరావు, రమేష్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, సుందరీదేవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

వరద నీటి కాలువ నిర్మాణ పనుల పరిశీలన



భాగ్యనగర్ ఫేజ్–3లో చేపడుతున్న వరదనీటి కాలువ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ భాగ్యనగర్ ఫేజ్–3లో చేపడుతున్న వరద నీటి కాలువ నిర్మాణ పనులను బుధవారం స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదర్‌నగర్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశామని, వరద నీటి కాలువ, యూజీడీ, సీసీ రోడ్ల వంటి అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు తెలియజేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగుండా మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. డివిజన్ అభివృద్ధికి తన శాయశక్తులు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, శ్రీధర్, విజయకృష్ణ, కెయస్ఆర్, మోహన్‌రావు, విజయ్‌భాస్కర్, బ్రహ్మ శేఖర్, వినోద్, సురేంద్ర, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు అనుమతి, భద్రత కల్పించాలి



డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకుడు శ్రీకర్‌రావు

మూసాపేట: ప్రగతినగర్ కాలనీ వసుంధర హాస్పిటల్ రోడ్డులో చిరు వ్యాపారస్తులు పదేళ్ల నుంచి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని.. వారికి అనుమతి ఇచ్చి భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు, ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబర్ జి. శ్రీకర్‌రావు బుధవారం డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ అధికారులు వారి సిబ్బందితో వచ్చి అక్కడ ఉన్న వ్యాపారస్తులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా వారి షాపులను, వస్తువులను ధ్వంసం చేస్తున్నారని అన్నారు. వారికి ప్రత్యామ్నాయ మార్గాల చూపించి స్ట్రీట్ వెండర్ లైసెన్స్‌లు ఇప్పించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిట్ల మనోహర్, గున్నాల వినోద్, తిరుపతిరెడ్డి, వినోద్‌కుమార్ గౌడ్, నాగరాజు, శ్రీనివాస్‌చారి, ఆకుల రాము తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు బీజేపీ



రాంనరేష్ నగర్‌లో కరపత్రాలను అందజేస్తున్న హరీష్‌రెడ్డి, రవికుమార్‌యాదవ్

భాగ్యనగర్‌కాలనీ: బీజేపీ ప్రజాగోస – రవన్న భరోసా కార్యక్రమం బుధవారం హైదర్‌నగర్ రాంనరేష్ నగర్‌లో జరిగింది. మేడ్చల్‌జిల్లా బీజేపీ అధ్యక్షుడు హరీష్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ జానకీరామరాజు, సీనియర్ నాయకులు చారి, అరుణ్‌కుమార్, నవీన్‌గౌడ్, వేణుగోపాల్ యాదవ్, రాజారెడ్డి, సునీల్‌రెడ్డి, రామరాజు, భద్ర, సీతారామరాజు గడప గడపకు బీజేపీ పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్ జీహెచ్ఎంసీ ఎన్నికల్లో హైదర్‌నగర్ డివిజన్‌ను దత్తత తీసుకుంటున్నానని తెలిపారని కానీ అభివృద్ధి మాత్రం శూన్యమన్నారు. ఆలీ తలాబ్ చెరువు సుందరీకరణకు వేల కోట్ల రూపాయలు మంజూరైనా అభివృద్ధికి ఎందుకు నోచుకోవటం లేదని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో మీ ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలిచి ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మహిళా సాధికారితకు కృషి చేయాలి

హెచ్‌సీయూ అసోసియేట్ ప్రొ.డాక్టర్ షీలా సూర్యనారాయణన్



మాట్లాడుతున్న షీలా సూర్యనారాయణన్

రాయదుర్గం: హక్కులు, వనరులు, ప్రాతినిధ్యం వంటి మూడు ముఖ్యమైన పద్ధతులకు ఎంతో ప్రాముఖ్యత ఉందని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విమెన్స్ స్టడీస్ సెంటర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ షీలా సూర్యనారాయణన్ పేర్కొన్నారు. మహిళా సాధికారిత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జర్మనీ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ కో ఆపరేషన్ నిర్వహించిన రిటర్నింగ్ ఎక్స్‌పర్ట్ ఈవెంట్‌లో ఖాట్మండు 'ఫెమినిస్ట్ డెవలప్‌మెంట్ పాలసీ (ఎఫ్‌డీపీ)పై ఆమె ప్రత్యేక ఉపన్యాసం చేశారు. విద్యార్హత, శ్రామిక శక్తి భాగస్వామ్యం, హింస, రాజకీయ భాగస్వామ్యం, కుమారుల ప్రాధాన్యత ఫలితంగా బాలికలు, మహిళలపై వివక్ష చూపడానికి ఆస్కారం కలుగుతోందన్నారు. కార్యక్రమంలో పలువురు మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

హైపర్‌టెన్షన్‌పై అవగాహన, ర్యాలీ

రాయదుర్గం: కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా (సీఎస్ఐ), గ్లెన్‌మార్క్ ఫార్మా ఆధ్వర్యంలో బుధవారం హైపర్‌టెన్షన్‌పై అవగాహన,వాకథాన్ నిర్వహించారు. ప్రపంచ హైపర్ టెన్షన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్‌లో ఈ కార్యక్రమాన్ని ఉదయం 7 గంటలకు నిర్వహించగా వైద్యనిపుణులు, 150 మందికి పైగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హైపర్ టెన్షన్‌తో పోరాడడానికి, నివారణ చర్యగా శారీరక శ్రమను ప్రోత్సహించే లక్ష్యంతో 2.5 కిలోమీటర్ల వాకథాన్ కార్యక్రమం సాగింది. ఈ సందర్భంగా డాక్టర్ వీఎస్ రామచంద్ర మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా దాదాపు ప్రతి ముగ్గురిలో ఒకరిని ఇది ప్రభావితం చేస్తుందన్నారు.దాదాపు 50 శాతం మందికి వారి పరిస్థితి గురించి తెలియదనే భయంకరమైన నిజాన్ని గణాంకాలు వెల్లడిస్తున్నామన్నారు. 18 ఏళ్ల వయస్సు నుంచే గుర్తింపు, పర్యవేక్షణ అవసరమని ఆయన సూచించారు.

'గాంధీ'లో స్కీజోఫ్రీనియాపై అవగాహన



స్కీజోఫ్రీనియాపై విద్యార్థుల నాటక ప్రదర్శన

బన్సీలాల్‌పేట్: ప్రపంచ స్కీజోఫ్రీనియా(మనో వైకల్యం) దినోత్సవాన్ని బుధవారం సికింద్రాబాద్ గాంధీ ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించారు. మానసిక వైద్య విభాగం అధ్వర్యంలో ఓపీ బ్లాక్ హాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీజీ, ఇంటర్న్ డాక్టర్లు 'వీధి నాటకం' ప్రదర్శించి స్కీజోఫ్రీనియా లక్షణాలు, మంత్రగాళ్లు చేసే మోసాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో లభిస్తున్న వైద్య సేవల గురించి వివరించారు. ఈ సందర్భంగా గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు మాట్లాడుతూ.. స్కీజోఫ్రీనియా అనేది ఒక మానసిక వ్యాధి అని, దాని లక్షణాలు తెలుసుకొని వెంటనే ప్రభుత్వ దవాఖానాలోని మానసిక వైద్యులను సంప్రదించాలని కోరారు. మంత్రగాళ్లు, చేతబడి చేసే మోసగాళ్ల వద్దకు వెళ్లకూడదని, ప్రజలు మూఢనమ్మకాలను వదిలి వైద్య సేవలను పొంది ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఆస్పత్రి మానసిక విభాగాధిపతి డాక్టర్ ఎం. ఉమాశంకర్ మాట్లాడుతూ.. స్కీజోఫ్రీనియా సమస్య ఉన్నవాళ్లకు కుటుంబం, స్నేహితులు, సమాజం నుంచి తగిన ప్రోత్సాహం, ఆదరణ అందించి చేయూతనివ్వాలని కోరారు. స్కీజోఫ్రీనియా రోగులకు గాంధీ ఆసుపత్రిలో ఉచితంగా వైద్య పరీక్షలు, చికిత్స, మందులను అందజేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో కంటి విభాగాధిపతి డాక్టర్ రవిశేఖర్ రావు, ఆర్ఎంవోలు డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ నజీమ్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఇందిర, మానసిక విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అజయ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ డి. సురేష్, డాక్టర్ అనుపమ, పీజీ, ఇంటర్న్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయండి

పంజగుట్ట: ఖైరతాబాద్ నియోజకవర్గంలో పెండింగ్ పనులు లేకుండా అన్ని పనులు త్వరగతిన పూర్తిచేయాలని అధికారులకు ఎమ్మెల్యే దానం నాగేందర్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. బిస్తీ వాడ ప్లే గ్రౌండ్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని ఆదేశించారు. ఎస్ గార్డ్స్, వీర్‌నగర్‌లలో వర్షపు నీరు ఆగుతుందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సమస్య వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. చింతల్‌బస్తీలో కమ్యూనిటీ హాల్ పెండింగ్ పనులు వెంటనే పూర్తిచేయాలని, సీసీ రోడ్డు పనులు త్వరగా ప్రారంభిస్తామని స్థానికులకు తెలిపారు. తుమ్మలబస్తీ కమ్యూనిటీహాల్ త్వరలో ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లైన్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సమైక్య భారతి అసోసియేషన్ వారు కోరడంతో వెంటనే తన నిధులతో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి అప్పటికప్పుడే పోలీస్ కమిషనర్‌తో ఫోన్ మాటాడారు. తుమ్మలబస్తీలో నిత్యం పొల్యూషన్ వాటర్ వస్తుందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో వెంటనే కొత్త పైప్‌లైన్ వేయించాలని అధికారులకు సూచించారు. డ్రైనేజీ, వాటర్ కొత్త లైన్‌లు వేయగానే సీసీ రోడ్డు వేయించాలన్నారు. బల్కాపూర్ నాలాలో వ్యర్థలు తొలగించాలని సూచించారు. గాంధీతాతా నగర్‌లో మంచినీటి, మురుగు నీటి సమస్య పరిష్కరించాలని కోరారు.

ఉచిత డయాగ్నోస్టిక్ సేవలు

బాలానగర్ పీహెచ్‌సీలో 57రకాల వైద్య పరీక్షలు




తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న వ్యక్తి

బాలానగర్: బాలానగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డయాగ్నస్టిక్ సెంటర్‌లో ప్రజలకు ఉచిత సేవలు అందుతున్నాయి. ఈ డయాగ్నస్టిక్ సెంటర్‌లో 57 రకాల ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. చక్కర వ్యాధి, బీపీ, థైరాయిడ్ పేషెంట్స్ ఎక్కువగా లబ్ధి పొందుతున్నారు. ఫాస్టింగ్ బ్లడ్ షుగర్, హెచ్‌బీఏసీ, డెంగీ, మలేరియా టెస్టుల కోసం ప్రజలు ఎక్కువగా వస్తున్నారు.

వైద్య పరీక్షలకు..

వైద్య పరీక్షల కోసం వచ్చే వారు కేవలం ఆధార్‌కార్డు తీసుకొని వస్తే చాలు. రక్తపరీక్షల వివరాలు వారి ఫోన్ నంబర్లకు వెళ్తాయి. పేదలకు ఉచితంగా ఖరీదైన సేవలు అందిస్తున్నారు. ఎటువంటి రోగ నిర్ధారణ పరీక్ష అయినా చేస్తున్నారు. సామాన్యులకు కార్పొరేట్ వైద్య సేవలు అందుతున్నాయి. డబ్బులు ఆదా అవుతోంది. ఒకప్పుడు ప్రభుత్వ ఆసుపత్రి వైపు కన్నెత్తి చూడని వారు సైతం నేడు అదే ప్రభుత్వ ఆసుపత్రిలో తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్‌లో నిర్వహించే ఆరోగ్య పరీక్షల కోసం వస్తున్నారు.

పైసా తీసుకోకుండా వైద్య సేవలు



రక్త పరీక్షల కోసం బయటకు వేల రూపాయలు ఖర్చు అవుతాయి. నాణ్యమైన, ఖచ్చితత్వంతో కూడిన వైద్య సేవలు తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్ బాలానగర్‌లో అందుతున్నాయి. పైసా భారం లేకుండా సామాన్యులకు వైద్య సేవలు అందుతున్నాయి. అన్ని వర్గాల ప్రజలు వరంగా నిలబడింది ఈ కేంద్రం.

– చంద్రపాల్, కళ్యాణినగర్

అన్ని హంగులతో అంగన్‌వాడీ కేంద్రం



ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని జ్ఞాని జైల్‌సింగ్ నగర్ బస్తీలో సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అన్ని సదుపాయాలతో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎస్‌బీఐ మాదాపూర్ రీజియన్ ఏజీఎం రంజన్‌కుమార్, టోలిచౌకి ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ హేమలత ప్రారంభించారు. సీఎస్ఆర్‌లో భాగంగా ఈ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపిక చేసిన ఎస్‌బీఐ దీని రూపురేఖలను సమూలంగా మార్చేసింది. చిన్నారులకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేసింది. ముఖ్యంగా టీవీ, ట్యాబ్, వాటర్ ప్యూరిఫయర్, బొమ్మలతో కలర్ పెయింటింగ్, స్టడీ మెటీరియల్, కుర్చీలు, ఏర్పాటు చేశారు. పిల్లలకు అందుబాటులో స్టాండ్లు కూడా ఏర్పాటు చేశారు. ఒకప్పుడు చెత్తాచెదారం, చుట్టూ పిచ్చిమొక్కలు, విద్యార్థులు రావడానికే భయపడే స్థితిలో ఉండే ఈ అంగన్‌వాడీ కేంద్రానికి ఎస్‌బీఐ నగిషీలు చెక్కింది. రూ. 1.10 లక్షల వ్యయంతో తీర్చిదిద్దారు. ఈ అంగన్‌వాడీ ఏర్పాటుతో స్థానికులతో పాటు తల్లిదండ్రులు, చిన్నారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో మౌలిక సదుపాయాల కల్పనపట్ల తమకు ఎంతో ఆనందంగా ఉందని ఈ సందర్భంగా హేమలత తెలిపారు.

ఎస్ఎంసీ కమిటీల కాలపరిమితి పెంపు

- మన ఊరు–మనబడి పనులకు గడువు పొడగింపు
- బడుల అభివృద్ధిలో కమిటీల పాత్ర కీలకమే..
- గ్రేటర్ సహా శివారు జిల్లాల్లో 2,497 ఎస్ఎంసీ కమిటీలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: సర్కారు బడుల అభివృద్ధిలో ఎస్ఎంసీ(పాఠశాల యాజమాన్య కమిటీ)ల పాత్ర కీలకంగా ఉంటోంది. ఈ కమిటీల ఆమోదంతోనే ప్రభుత్వ బడుల్లో అభివృద్ధి పనులు, కార్యక్రమాలు జరుగుతాయి. కీలకమైన ఈ కమిటీల గడువు ఈ నెలాఖరుతో ముగియనుండగా.. మరో ఆరు నెలలు(నవంబరు వరకు) పెంచుతూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

నిధుల వినియోగంలో కీలకం..

గ్రేటర్ హైదరాబాద్‌తో సహా శివారు జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తంగా 2,497 ఎస్ఎంసీ కమిటీలు కాగా, ఇందులో హైదరాబాద్ జిల్లాలో 631, రంగారెడ్డి జిల్లాలో 1,301, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 505 ఎస్ఎంసీ కమిటీలు ఉన్నాయి. ఒక్కో తరగతి నుంచి విద్యార్థుల తల్లిదండ్రులు ఇద్దరిని సభ్యులుగా తీసుకుంటారు. ప్రాథమిక పాఠశాలలకు 15, ప్రాథమికోన్నతకు 22, ఉన్నత పాఠశాలలకు 9 మంది సభ్యులుగా ఉంటారు. వీరి నుంచి చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుంటారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. బడుల అభ్యున్నతికి వీరు క్రియాశీలకంగా వ్యవహరిస్తారు. ప్రభుత్వం కేటాయించే నిధులను చైర్మన్, ప్రధానోపాధ్యాయుడి సంయుక్త ఖాతాలో జమ చేస్తారు. కమిటీ ఆమోదంతో వీటిని ఖర్చు చేస్తారు. గతంలో మూడు నెలలకు ఒకసారి సమావేశాలు జరిగేవి. గత విద్యా సంవత్సరం నుంచి ప్రతి మూడో శనివారం నిర్వహిస్తున్నారు.

పనులు వేగవంతమయ్యేనా?

గ్రేటర్ హైదరాబాద్‌తో సహా మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో మన ఊరు– మన బడి పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. మేడ్చల్, హైదరాబాద్(ఇన్‌చార్జ్) జిల్లాల కలెక్టర్ అమయ్‌కుమార్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీష్ పలుమార్లు సమీక్షలు నిర్వహించినా.. గాడిన పడటం లేదని తెలుస్తోంది. ఈ అభివృద్ధి పనులకు సంబంధించి ఎస్ఎంసీ కమిటీలే కీలకపాత్ర పోషిస్తున్నాయి. మన ఊరు–మన బస్తీ–మనబడి కార్యక్రమం కింద రూ.30 లక్షలలోపు పనులను కమిటీల ఆమోదంతో నామినేషన్ పద్ధతిలో కేటాయించారు. రూ.30 లక్షలకు పైగా నిధులున్నవి టెండర్ల ద్వారా చేపడుతున్నారు. మన ఊరు–మన బడి పనులకు ఆటంకం కలగవద్దనే ఉద్దేశ్యంతో కమిటీలకు ఈ నెలాఖరు వరకు ఉన్న గడువును నవంబరు 30 వరకు పెంచుతూ పాఠశాల డైరెక్టరేట్ ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా విద్యాశాఖ వర్గాలు పేర్కొన్నాయి.